క్లుప్తంగా

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

తాళ్లపూడి(కొవ్వూరు): మీ కోసం కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'పీజీఆర్ఎస్ – మీ కోసం' వేదికలో వచ్చిన అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మీ కోసంలో 13 అర్జీలు వచ్చాయని తెలిపారు. వారంలో రెండు రోజులు ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించి జిల్లా అధికారి, డివిజన్ అధికారులతో సమావేశం నిర్వహించి అర్జీలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మీ కోసంలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి, వారు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నల్లబ్యాడ్జీలతో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

నల్లజర్ల: తమ దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ నల్లజర్లలో సోమవారం మధ్యాహ్నం విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు భరించాలని 1999 నుంచి 2004 మధ్యలో రిక్రూట్ అయిన ఉద్యోగులకు ఇపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌ను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అమలు చేయాలని, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని, 10 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన వారందరికీ 2018 రివిజన్‌లో మంజూరు చేసిన సర్వీస్ ఇన్సెంటివ్ పునరుద్ధరించాలని తదితర 12 డిమాండ్లతో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక ఏడీఏ, ఏఇలతో పాటు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



రణభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నల్లజర్ల: ఉపాధ్యాయులకు సంబంధించి విద్యారంగ, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై యూటీఎఫ్ తలపెట్టిన రణభేరి జాతాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా సంబంధిత వాల్‌పోస్టర్‌ను సోమవారం నల్లజర్లలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్సీ, ఐఆర్ ప్రకటిస్తామని నమ్మబలికి లబ్ధి పొందిన తర్వాత వారి న్యాయమైన సమస్యలు కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17న జిల్లాలో గోకవరంలో ప్రవేశించే ప్రచార జాతాకు ఉపాధ్యాయులంతా స్వాగతం పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మనోహరకుమార్, మండల ప్రధాన కార్యదర్శి కిషోర్, కార్యదర్శి నాగేశ్వరావు, ఏ.శ్రీనివాస్, కే.మావుళ్లు, పి.అప్పారావు, కే.సూర్యచంద్రరావు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికి వెన్నెముక ఇంజినీర్లే



ఇంజినీర్లను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పెరవలి: దేశానికి వెన్నెముక ఇంజినీర్లేనని, దేశం అభివృద్ధి చెందుతున్న తీరే అందుకు నిదర్శనమని పెరవలి ఎంపీపీ కార్పెర్ల ప్రసాద్ పేర్కొన్నారు. పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇంజినీరింగ్ డే సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన ఇంజినీర్లను పెరవలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టెక్నాలజీలో దేశం ముందుకు దూసుకుపోతున్నదంటే అందుకు ఇంజినీర్లు, వారు నిర్మించిన కట్టడాలే ప్రతిభకు, పనితనానికి నిదర్శనమన్నారు. ఎలక్ట్రికల్ ఏఈ డేవిడ్ నిచ్చల్ పంచాయతీరాజ్ ఏఈ భగవన్నారాయణ, హౌసింగ్ ఏఈ సతీష్, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్‌రావు, వివిధ గ్రామాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కోలా సీతయ్యనాయుడు, మాదిరెడ్డి బాబూజీరావు, సలాది ఉదయ భాస్కరరావు, లయన్స్ సభ్యులు కోటిపల్లి మురళీకృష్ణ, చంటిరాజు, యాతం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీర్లకు సత్కారం

నిడదవోలు: ఇంజినీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని తిమ్మరాజుపాలెం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ ఏఈలు హేమంత్ శ్రీనివాస్, అవినాష్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం ఇంజినీర్ల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు అరుణకుమారి, కార్యదర్శి రామచంద్రంరావు, కోశాధికారి సుంకవల్లి శ్రీధర్, నిడమర్తి భాస్కరరావు, సుంకవల్ల ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

వినరు మా గోస

- బాలాజీనగర్‌లో సౌకర్యాల లేమి
- సరైన రోడ్లు, డ్రైనేజీలు లేక అవస్థలు
- చినుకు పడితే కునుకు కరవు

నిడదవోలు: పట్టణ శివారున ఓ మూలకు విసిరేసినట్టు ఉండే 26వ వార్డు బాబూజీనగర్ సమస్యల వలయంతో అస్తవ్యస్తంగా మారింది. దీంతో కాలనీ వాసులు అసౌకర్యాల నడుమ దుర్భారజీవితం కొనసాగిస్తున్నారు. సుమారు ఈ వార్డులో 1,000 మంది జనాభా, 270 కుటుంబాలు నివాసముంటున్నారు. కాలనీలో సరైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు లేకపోవడంతో మురుగునీటితో పాటు వర్షపు నీరు రోడ్లమీద నిల్వ ఉంటుంది. చినుకు పడితే రోడ్లన్ని అధ్వానంగా తయారవుతున్నాయి. రోడ్లు నీట మునగడంతో ప్రజలు వర్షపు నీటిలో రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో కనీస వసతులు కల్పించడంలో అధికారులు అలసత్వం వహిస్తుండటంతో దుర్భార జీవితాన్ని గుడుపుతున్నారు.

రోడ్లు లేని వైనం..

ఆకాశంలో మబ్బులు చూసి ఇక్కడ స్థానికులకు గుండెలు గుభేల్‌మంటున్నాయి. వర్షం వస్తే రోడ్లపై నీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురుగు నీరుపారుదల లేక దుర్వాసన వెదజల్లుతోంది. వర్షపునీరు, మురుగునీరు కలిసిపోయి రోజుల తరబడి ఖాళీ స్థలాల్లో మురుగు పేరుకుపోయి దోమలకు నివాస స్థలాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ఇక్కడ ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిల్వతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు పెరిగి రోగాలు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.



బాపూజీనగర్‌లో నిలిచిన వర్షపు నీటిలో చిన్నారుల అవస్థలు



ప్రైవేట్ స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన మొక్కలు

చిట్టడవిని తలపిస్తున్న జాగాలు

కాలనీలో ఏళ్ల తరబడి ఖాళీగా ఉంటున్న స్థలాలతో అవస్థలు ఎక్కువయ్యాయి . చిట్టడవిని తలపిస్తున్న ఖాళీ జాగాలు స్థానికులను ఆందోళన కలిగిస్తున్నాయి. స్థలాల యజమానుల నిర్లక్ష్యం కారణంగా పిచ్చి మొక్కలు గుబురుగా పెరిగి, మురుగు నీటితో నిండి దోమలకు ఆవాసంగా మారాయి. దీంతో పగలు రాత్రి తేడా లేకుండా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు భారీగా పెరిగిపోవడంతో విషసర్పాలకు నిలయంగా మారడంతో స్థలాలను ఆనుకొని ఉన్న భవనాల్లోకి విష సర్పాలు గోడలపై నుంచి పాకుతూ ఇంట్లోకి ప్రవేశిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి



కాలనీలో రోడ్లు, మురుగు కాలువలు వంటి సౌకర్యాలు లేవు. వర్షం వచ్చిందంటే ఇళ్లలోకి నీరు చేరి రాత్రిపూట దోమలు స్వైర విహారం చేయడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. ఇన్ని సమస్యలు పడుతున్న మమ్మల్ని పట్టించుకునే వారే లేరు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందిస్తే బాగుంటుంది.

– జి.భాగ్యలక్ష్మి, బాబూజీనగర్, నిడదవోలు

50 కుటుంబాలకు తాగునీరు లేదు



కాలనీలో రహదారులు, డ్రైనేజీ వంటి సౌకర్యలే కాక, తాగునీటికి సైతం ఇబ్బందులు పడుతున్నాం అంటే అధికారుల తీరు ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మురుగునీరు, వర్షపు నీరు కలిసిపోయి మురుకు కూపంగా కాలనీ మారింది. కాలనీలో రహదారులు వేయకపోయినా కనీసం డ్రైనేజీలైనా నిర్మించాలి.

– జీవీడీ ప్రసాద్, బాబూజీనగర్, నిడదవోలు

దుర్భర జీవితం

పల్లంగా ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్గంధానికి నిలయంగా మారాయాని, దీంతో దుర్వాసనకు ఇళ్లలో ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. ప్రధానంగా వార్డు శివారున ఉన్న నాలుగు వీధుల్లో సమస్య తీవ్రత ఎక్కువగా ఉంది. మురుగునీటికి బిల్డింగుల ప్రహరీలు గుల్లయిపోయి పెచ్చులూడిపోతున్నాయి. స్థానికులు సొంత నిధులతో బిల్డింగ్ ప్రహరీలు చుట్టూ మట్టి తోలించుకున్న ఫలితం ఉండడం లేదని విషసర్పాలు ఇంటిలోకి ప్రవేశిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

- 15వ ఆర్థిక సంఘం నిధులపై వివాదం
- సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీపీ, ఎంపీటీసీలు

తాళ్లపూడి: సభలో సభా మర్యాద పాటించకుండా సభ్యులపై బయటి సభ్యులు వచ్చి తమపై అనుచిత వ్యాఖ్యలతో దురుసుగా ప్రవర్తించడం, ఆర్థిక సంఘం నిధులు చెల్లింపులపై ఎంపీపీ పోశిబాబు, సభ్యులు మండిపడి సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. తాళ్లపూడి ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. సమావేశంలో మొదటగా లేవనెత్తిన 15వ ఆర్థిక సంఘం ద్వారా విడుదలైన నిధుల చెల్లింపులు విషయంలో సర్పంచులు కానీ, ఎంపీపీలు ఖర్చు పెట్టేందుకు వీలు లేదంటూ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో అభ్యంతరం తెలిపారు. దీనిపై సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును సర్పంచ్‌లు, ఎంపీటీసీ కలిసి వినతి పత్రం అంజేశారు. దీనిపై సమావేశంలో ఎమ్మెల్యే వివరణ ఇస్తుండగా, మధ్యలో సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి పరశు రామారావు, ఎంపీటీసీ సభ్యులు గుంటు చిన్నబ్బాయి తదితరులు ఎమ్మెల్యేతో మాట్లాడుతుండగా సభలో పాల్గొన్న టీడీపీకి చెందిన కొందరు నాయకులు ఎంపిటీసీలపైకి దూకుడుగా వచ్చి ఆగ్రహం వ్యక్తం చేశారు. రావూరుపాడు ఎంపీటీసీ హరిబాబు (జనసేన) మాట్లాడుతూ గత ప్రభుత్వంలోనూ నిధులివ్వలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాళ్లపూడి మండలంలో వచ్చే నిధులు కంటే ఖర్చు ఎక్కువ చేశారని, అత్యవసర పనులకు నిధులు అవసరాన్ని బట్టి ప్రణాళికాబద్ధంగా ఖర్చు పెట్టాలని సూచించారు.



సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీపీ, సభ్యులు, సర్పంచ్‌లు



సమావేశంలో సభ్యులను ప్రశ్నిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ నాయకుల దౌర్జన్యం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కనీసం నిధులు కూడా రాలేదు కదా అని ఎమ్మెల్యే చెప్పడం, ఈ సమయంలోనే ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న సభ్యులను కొంత మంది టీడీపీ నాయకులు అడ్డుకోవడం, పోలీసులు వారిని అడ్డుకోవడానికి రావడంతో సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. వివాదం పెద్దది కావడంతో ఈ దశలో ఎంపీపీ పోశిరాజు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సభలో మాకు విలువలెనప్పుడు ఎందుకు ఉండాలి, కార్యదర్శులతో పరిపాలన చేసుకొండంటూ సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. అనంతరం సమావేశం బయట ఎంపీపీ పోశిరాజు, సర్పంచ్‌లు కొమ్మిరెడ్డి పరశురామారావు, గండి రాంబాబు, తిగిరిపల్లి వెంకట్రావు, ఎలిపే సుధారాణి, సభ్యులు చిన్నబ్బాయి, కోదాటి కనకయ్య, లక్ష్మణరావు, వీరరాఘవమ్మ, స్వరాజ్యలక్ష్మి, పూడి వరలక్ష్మి, అందుగుల పాప, నాయుడు విజయలక్ష్మి తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వంలో అసలు ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో అధికారులకు, ఎమ్మెల్యేకు సమస్యలు చెప్పుకునే హక్కు తమకు ఉందని, సభకు ఎటువంటి సంబంధంలేని వారు సమావేశంలో పాల్గొని తమపై దురుసుగా ప్రవర్తించడాన్ని కూడా తీవ్రంగా పరిగణించాలన్నారు.

ఎమ్మెల్యే వివరణ..

సభలో ఎవరు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని దానికి తమ పార్టీ అయినా తాను ఒప్పుకోనన్నారు. ఆర్థిక సంఘం నిధులకి తానేమి అభ్యంతరం తెలపలేదని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు తెలిపారు. ఏ మండలానికి సంబంధించిన నిధులు ఆ అమండలానికే ఖర్చు పెడతాం తప్ప, తనకేమీ కావాలని అడగలేదని, సభ్యులు ఎందుకు వాకౌట్ చేసారో తనకి అర్థంకాలేదని ఎమ్మెల్యే ముప్పిడి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మిలావణ్య, తదితరలు పాల్గొన్నారు.

వైద్య విద్యపై కూటమి కుట్ర

- కాలేజీలను ప్రైవేటీకరించాలని చూస్తున్న ప్రభుత్వం
- పేద వైద్య విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లే యోచనలో కూటమి

చాగల్లు: డాక్టర్ కావాలనే పేద విద్యార్థుల కలలను నాశనం చేసేందుకు కుటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైద్య విద్యకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారని, పేద విద్యార్థులకు మేలు చేసేందుకే రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ జగన్ 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తీసుకువచ్చారన్నారు. వాటిని ప్రైవేటీకరించాలని కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం కక్ష సాధింపుల్లో భాగంగా ప్రభుత్వ రంగంలోని 17 వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. తొలి దశలో మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని కాలేజీలను, రెండో దశలో అమలాపురం, బాపట్ల, పెనుకొండ, నర్సీపట్నం, పాలకొల్లు, కళాశాలల ప్రైవేటీకరణ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని ఆయన పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం కాకుండా అడ్డుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టి, అప్పటి ప్రభుత్వ హయాంలోనే 5 మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు సైతం ప్రారంభించారన్నారు. నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం మెడికల్ కాలేజీల్లో 2023–24లో ప్రారంభం కాగా, గతేడాది పాడేరు వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభించామన్నారు. తమ ప్రభుత్వంలో రూ.8,450 కోట్లతో మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టగా, అన్నింటినీ ప్రైవేటుకు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేదలకు విద్యను ఎలా దూరం చేస్తున్నారనడానికి నిదర్శనంగా ఈ వ్యవహారం నిలుస్తుందని తలారి వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు.



తలారి వెంకట్రావు

దళిత రణభేరీని జయప్రదం చేయండి

పెరవలి: రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 24 తేదీన విజయవాడలో చేపట్టిన ధర్నాకు నిడదవోలు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున దళిత సోదరులు తరలివెళ్లాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మాపు చిత్రసేన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పెరవలి బీఎస్పీ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై నాయకులు ధర్నాకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దళితులపై దాడులు పెరిగాయని అందుకు నిరసనగా దళిత రణభేరీ పేరిట జరుగుతున్న ఈ ధర్నాను దళితులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంత చేయాలని కోరారు. జగన్ పరిపాలనలో దళితులపై దాడులు జరిగితే పరామర్శలు చేసిన కూటమి నేతలు, ఇప్పుడు దళిత కాలనీల వైపు కన్నెతి చూడటం లేదని ధ్వజమెత్తారు. ఎన్నికల నాడు ఓట్లు కోసం ఈ రకంగా వ్యవహరించారని, నేడు అధికారం చేపట్టిన తరువాత మాపై దాడులకు దిగుతున్నా పట్టించుకున్న పాపాన్న పోలేదన్నారు. దళితులు కూటమి పాలనలో దినదిన గండంగా బ్రతకవలసి వస్తుందని ఎప్పడు ఏ పేటపై దాడులు జరుగుతాయోనని తెలియని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల పక్షాన్న గళం విప్పేందుకు బీఎస్పీ పార్టీ రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా విజయవాడలో ఈ నెల 24 న ధర్నాచౌక్‌లో జరుగుతున్న దళిత రణభేరీ కార్యక్రమాన్ని విజయవంతం చేసి దళితులు ఐక్యత చాటుదామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

కార్మిక సంక్షేమ మండలిని పునరుద్ధరించాలి

నిడదవోలు: కూటమి పాలకులకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలిని పునరుద్ధరించాలని ఏపీ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. పట్టణంలో విశ్వ బ్రాహ్మణ కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా భవన నిర్మాణ కార్మికుల సభలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా ప్రసూతి, మరణం, వైద్యం, వివాహం తదితరాలకు అందచేయాల్సిన ఆర్థిక పరిహారాలు నేటి కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడం ద్వారా కార్మిక వర్గంపై వివక్ష తేటతెల్లమవుతోందన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మానికల నాగరాజు, ఈమని గ్రీష్మ కుమార్‌లు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి బోర్డు నిధులు ఖర్చు పెట్టడానికి మనసు రాని ప్రభుత్వం తమ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వలవల బాబ్జీకి మాత్రం బోర్డు చైర్మన్ పదవి కట్టబెట్టి, బోర్డు నిధులు ఖర్చు చేస్తోందని, పదవి చేపట్టి నెలలు గడుస్తున్నా వేలాది రూపాయలు జీత భత్యాలు మాత్రం పొందుతూ, కార్మిక సంక్షేమాన్ని గాలికొదిలేశారన్నారు.




ఐక్యత చాటుతున్న నాయకులు, కార్మికులు

ఈ కార్యక్రమంలో ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు యస్.రామ్మోహన్, యర్రా శ్రీను, లింగమల్లు శ్రీను, పామర్తి సత్య నారాయణ, పాతకోకల నాగేశ్వరరావు, సీహెచ్ రమేష్, కాకర్ల శ్రీను, గెడ్డం రవీంద్ర, రొంగల హరీష్, రాజేష్ , ఈ. మల్లిక, ఎస్‌కే వలీ, ఖండవల్లి వీర వెంకట్రావు, రవ్వ సురేష్ కుమార్, కోనేటి మల్లేశ్వరరావు , మల్లిడి రామిరెడ్డి, సురేష్, మంచిలి రాజు, షేక్ బాజీ ఎస్. సూరిబాబు, దేవుడు, నీలం సురేష్, గోగుల చిన్నయ్య, ఎం. ప్రసాద్, దుర్గా రావు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ అధికారుల పర్యటన

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామంలో ఇటీవల వరుస గేదెల మృత్యువాత పడుతున్న నేపథ్యంలో గన్నవరం పశువైద్య కళాశాల నుంచి సోమవారం ప్రొఫెసర్లు డాక్టర్లు జి.శ్రీనివాసరావు, కె.సతీష్, సురేష్ గ్రామంలో పరిస్థితిని పరిశీలించారు. గ్రామంలో పర్యటించి ఇప్పటి వరకు చినిపోయిన పాడి గేదెల మరణాలకు సంబంధించి వివరాలను సేకరించారు. వ్యాధిబారిన పడిన పాడి గేదెలను పరిశీలించి, వాటికి పరీక్షలు నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. ఇటీవల పశు సంవర్ధక శాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన మందులతో పశువుల ఆరోగ్యం కొంత మెరుగుపడిందని రెతులు తెలిపారు. వారివెంట జిల్లా ఏడీ వెంకటరెడ్డి, మండల వైద్యాధికారి డా.బాలాజీ, గ్రామ ఉప సర్పంచ్ తోట రామకృష్ణ పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న గన్నవరం పశువైద్య కళాశాల ప్రొఫెసర్లు

ఎడతెరిపి లేని వర్షం

నిడదవోలు రూరల్: నిడదవోలు మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సమిశ్రగూడెం, తాడిమళ్ల, కోరుమామిడితో పాటు పలు గ్రామాల్లో విస్తరంగా వర్షం పడటంతో రహదారులపై వర్షపు నీరు పొంగి ప్రవహించింది. కాటకోటేశ్వరం- ఉనకరమిల్లి ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఎర్రకాలువ ఉధృతిని పరిశీలించిన ఆర్డీఓ



కంసాలిపాలెంలో కాలువ ఉధృతిని పరిశీలిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

నిడదవోలు రూరల్: ఎర్రకాలువ ఉధృతిని దృష్టిలో పెట్టుకుని మండల అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత ఆదేశించారు. మండలంలోని కంసాలిపాలెం–మాధవరం వంతెన వద్ద ఎర్రకాలువ ఉధృతిని సోమవారం ఆమె పరిశీలించారు. లోతట్టు ప్రాంత వాసులను అవసరమైతే పునరావాస కేంద్రాలను తరలించాలన్నారు. అనంతరం ప్రత్యేక వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ వీఎస్‌వీఎల్ జగన్నాథరావు, సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్, ఆర్ఐ సత్యేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకుంటాం

గోపాలపురం: మండలంలోని చిట్యాల గ్రామ పరిధిలోని కొవ్వాడ కాలువ ఉధృతికి నీటి మునిగిన పంట పొలాలను సోమవారం కొవ్వూరు ఆర్డీఓ రాణిసుస్మిత పరిశీలించారు. నష్టపోయిన పంటలను ఆమె ప్రత్యక్షంగా పరిశీలించి రైతలతో మాట్లాడారు. వ్యవసాయ శాఖ అధికారులు నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి వెంటనే నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిహారం, అవసరమైన సహాయక చర్యలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. పర్యటనలో తహసీల్దార్ సాయి ప్రసాద్, జిల్లా వ్యవసాయ సహాయ అధికారి ప్రసాద్, మండల వ్యవసాయాధికారి ఏసుబాబు, రైతులు పాల్గొన్నారు.

అరటి సాగుపై అవగాహన



రావూరుపాడులో రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

తాళ్లపూడి: అరటి సాగులో అధికంగా ఆశిస్తున్న బ్యాక్టీరియా దుంపకుళ్లు తెగులు దాని నివారణపై రైతులు దృష్టి సారించాలని శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్ర కుమార్ తెలిపారు. మండలం రావురూపాడులో గామ రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం వివిధ రకాల ఉద్యాన పంటలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అరటి పంటలలో ఎరువుల యాజమాన్యం, చీడపీడల, తెగుళ్ల గురించి అరటి మొక్క నాటినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వీరా హరిబాబు, రైతులు సిద్ధ దుర్గా ప్రసాద్, నవభారత్ ఆయిల్ పామ్ స్టాఫ్, ఉద్యాన, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మాజీ సొసైటీ అధ్యక్షుడికి వెంకట్రావు పరామర్శ



శ్రీనివాస్‌ని పరామర్శిస్తున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి: మండలంలోని పోచవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు దుగ్గిరాల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యం పాలయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమెమ్మల్యే తలారి వెంకట్రావు స్థానిక నాయకులతో కలిసి ఆయన ఇంటికి వెళ్లి శ్రీనివాస్ ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు మద్దుకూరి దొరబాబు, తదితరలున్నారు.